పశుపేడతో ప్రయోజనాలు

లారీలో పొలానికి తరలిస్తున్న పశుపేడ

- అధిక దిగుబడికి తోడ్పాటు
- భూసారం పెరుగుదల
- తగ్గనున్న సాగు ఖర్చు

నార్నూర్, ఏప్రిల్ 2 : పంటల సాగులో రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నా రైతులు ఆ దిశగా దృష్టి సారించడంలేదు. అధిక దిగుబడి వస్తున్నదనే అపోహతో రసాయన ఎరువులు వాడి నష్టపోతున్నారు. రసాయన ఎరువులతో దిగుబడి తగ్గడంతో పాటు భూసారం క్షీణిస్తుందనే విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని, ప్రధానంగా పశుపేడ ప్రాముఖ్యత తెలుసుకోవాలని నార్నూర్, గాదిగూడ మండలాల వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఎప్పుడు వేయాలంటే..

పశువుల ఎరువు, వర్మి కంపోస్టు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల ఎరువు, వేపలను సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవచ్చు. సేంద్రియ ఎరువుల్లో ఉన్న పోషకాల శాతాన్ని తెలుసుకొని తగిన మోతాదులో దశల వారీగా వేస్తూ పంటలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. దిగుబడులు పెరుగుతాయి. భూసారం అభివృద్ధి చెందుతుంది. ముందుగా పంట పొలాల్లో పశువుల పేడను వేసుకుంటే పంట దిగుబడికి మేలు చేకూరుతుంది. దుక్కులు దున్నుకునే ముందు నుంచే పంట పొలాల్లో పశుపేడను వేసుకుంటే మంచిది.

ప్రయోజనాలు..

దుక్కులు దున్నాక పశువుల పేడ వేస్తే పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల పేడను ఎరువుగా ఉపయోగించాలి. సేంద్రియ ఎరువైన పశువుల పేడను పంట పొలాల్లో పోయడంతో ఆ భూముల్లో భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన లవణాలు పంటలకు అందుతాయి. నేలలో ఉన్న మంచి సూక్ష్మజీవుల వృద్ధికి తోడ్పడి, రైతుకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేలా దోహదపడుతుంది. భూమి గుల్లబారి నీరు నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుంది. మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధిచెంది దిగుబడి పెరుగుతుంది. మొక్కలకవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాషియం, బోరాన్, మాలిబ్డినమ్, జింక్, కాల్షియం వంటి పదార్థాలు సేంద్రియ ఎరువుల్లోనే ఎక్కువగా లభిస్తాయి.

పంటలకు పోషకాలు..

పంటలకు ప్రధానంగా నత్రజని, భాస్వరం, పొటాష్ (ఎస్-పీ-కే) పోషకాలు (మైక్రోన్యూట్రియంట్స్) అవసరం ఉంటాయి. పశువుల ఎరువులో 0.5-15 శాతం నత్రజని, భాస్వరం 0.3-0.9 శాతం, పొటాష్ 0.5-1.9 శాతం ఉంటుంది. కోళ్ల ఎరువులో నత్రజని 2.3-3.0, భాస్వరం 1.3-2.0, పొటాష్ 1-2 శాతం. గొర్రెలు, మేకలు ఎరువులో నత్రజని 0.2-0,7, భాస్వరం 0.4-0.6, పొటాష్ 0.1-3.0, వర్మి కంపోస్టులో నత్రజని 1.5-3.0, భాస్వరం 1.05-2.2, పొటాష్ 1.1.-1.75 పోషకాలు ఉంటాయి. వీటిని తెలుసుకొని సేంద్రియ పోషకాలతో పాటు సిఫారుసు చేసినట్లుగా రసాయన ఎరువులు వేసుకోవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం..

గ్రామాల్లో రైతులకు సేంద్రియ ఎరువులపై వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రధానంగా పశుపేడ ప్రాముఖ్యత గురించి వివరిస్తున్నాం. రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేసుకునే విధానంపై తెలియజేస్తున్నాం. రైతులు వారి పొలాల్లోనే సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చు.

-జాడి దివ్య, వ్యవసాయాధికారి(గాదిగూడ)

చట్టాలపై అవగాహన ఉండాలి

ఎదులాపురం: అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి

ఎదులాపురం, ఏప్రిల్ 2:ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డైట్, ఐటీఐ కాలేజీల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వాటిని వాటిని ఏ సమయంలో వాడాలో తెలస్తుందన్నారు. సఖీ కేంద్రం ద్వారా 24 గంటల పాటు సేవలందిస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఆపదలో ఉంటే 181, 100, 1930 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. పోక్సో, గృహహింస, బాల్యవివాహాల నిరోధక చట్టాలు, సైబర్ క్రైమ్, స్మార్ట్ ఫోన్ వాడకంలో ఉన్న లాభనష్టాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ సుజాత, శ్రీనివాస్, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం లీగల్ కౌన్సెలర్లు మంజులత, సంఘమిత్ర, కేస్ వర్కర్ నాగమణి, విద్యార్థులు ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

జైనథ్, ఏప్రిల్ 2 : జిల్లా మహిళా సాధికారత, సఖీ కేంద్రాలు సంయుక్తంగా మంగళవారం గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ బేటీ బచావో- బేటీ పడావో పథకం, పీసీపీఎన్‌డీటీ , గృహ హింస చట్టాలు, పని చేసే చోట లైంగిక వేధింపులు, లింగ వివక్షతపై సమగ్రంగా వివరించారు. ఇక్కడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుచల, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, ఏఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జైనథ్: మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ యశోద

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఎదులాపురం, ఏప్రిల్ 2: తలమడుగు మండలం బరంపూర్ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహేందర్ యాదవ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి ప్రణీత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహేందర్ యాదవ్ ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లారని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా నాయకులు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈవో వెల్లడించారు.

శిక్షణ తరగతులను పరిశీలించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పీవో, ఏపీవోల శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. మంగళవారం శిక్షణ తరగతులను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించి, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

జైనథ్(బేల), ఏప్రిల్ 2 : బేలలో డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఆదిలాబాద్‌కు మార్చారన్నారు. ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుకునే గిరిజన విద్యార్థులు జిల్లాకేంద్రానికి వెళ్లి పరీక్ష రాయాలంటే ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. డిగ్రీ సెమిస్టర్లకు పరీక్షా కేంద్రాన్ని బేల మండల కేంద్రంలోనే కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా ఎస్ ఎఫ్‌డీ కన్వీనర్ శివానీత్‌వార్ ఓం ప్రకాశ్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి, అక్షయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 2: అమరవీరుల సంస్మరణ దినాన్ని అమరవీరుల స్తూపం వద్ద ఈ నెల 20న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి నగేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం అమరవీరుల స్తూపం వద్ద తుడుందెబ్బ ఆధ్వర్యంలో నివాళులర్పించి మాట్లాడారు. అమరవీరుల స్తూపానికి ఎకరం భూమి సరిపోవడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఎకరం భూమి కొనుగోలు చేసివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 20న ఆదివాసీలు ఎలాంటి శుభకార్యాలు పెట్టుకోవద్దని కోరారు. ఈ నెల 8న అమరవీరుల స్తూపం షెడ్డులో అమరవీరుల దినోత్సవంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రాయిసెంటర్ల సార్ మేడీలు, గ్రామపటేళ్లు, ఆదివాసీ పెద్దలు హాజరు కావాలని కోరారు.ఇక్కడ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్, నాయకులు సోయం రాందాస్, జుగ్నాక్ భరత్, నాగోరావ్, గేడం భరత్, పృథ్వీరాజ్ ఉన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

జైనథ్, ఏప్రిల్ 2 : రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో మంగళవారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ సాయినాథ్, సీఆర్పీఎఫ్ సీఐ సూరజ్, ఎస్ఐ పురుషోత్తం, పోలీస్ సిబ్బంది కేంద్ర బలగాలతో కలిసి దీపాయిగూడ, ఆనందపూర్ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దని, బెల్ట్ షాపులు నిర్వహించరాదని సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ఇచ్చోడ, ఏప్రిల్ 2 : మద్యం, డబ్బు, బహుమతులకు లొంగకుండా ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ స్వీప్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో లక్ష్మణ్, తహసీల్దార్ తుకారాం, ఎంఈవో ఉదయ్‌రావ్, అంగన్‌వాడీ టీచర్లు, కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 2: ప్రభుత్వ దవాఖానకు వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ సూచించారు. మంగళవారం పిట్టబొంగురం పీహెచ్‌సీని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణులతోపాటు బాలింతలపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఎండాకాలంలో తీసుకునే జాగ్రతలపై ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 2: దేవాపూర్‌కు చెందిన గుట్టే రామేశ్వర్ (22) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐలు లక్ష్మణ్, భీంరావ్ మంగళవారం తెలిపారు. రామేశ్వర్ వ్యవసాయ పనులు చేసుకొని జీవిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. పలు దవాఖానల్లో చూపించిన వ్యాధి నయం కాలేదు. సోమవారం రాత్రి కుటుంబీకులతో కలిసి భోజనాలు చేశారు. అందరూ నిద్రపోయాక గుట్టే రామేశ్వర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయదారుల పట్టివేత

పెగడపల్లి, ఏప్రిల్ 2: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో ఇద్దరు గంజాయి విక్రయదారులను పెగడపల్లి పోలీసులు పట్టుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా బొప్పాపూర్‌కు చెందిన మెస్రం నగేశ్, సిరికొండ మండలం జాకీర్‌గూడకు చెందిన పెందూర్ లక్ష్మణ్ పెగడపల్లి బస్టాండ్ చౌరస్తా వద్ద గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నించగా పట్టుకున్నట్లు వివరించారు. వీరు ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతంలో గంజాయిని సాగు చేస్తూ, ఇక్కడ విక్రయించేందుకు తీసుకురాగా ఎస్ఐ జాడి రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న బ్యాగులో 2.2 కిలోల గంజాయి లభించినట్లు వెల్లడించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గంజాయిని పట్టుకున్న పోలీస్ సిబ్బందిని జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీతిసింగ్, డీఎస్పీ రఘుచందర్ అభినందించారు. కార్యక్రమంలో పెగడపల్లి ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ సత్తయ్య, సిబ్బంది తిరుపతి, ఎల్లయ్య, సంపత్‌గౌడ్, రాజు ఉన్నారు.

పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో వివరాలు వల్లడిస్తున్న మల్యాల సీఐ రవి, పెగడపల్లి ఎస్ఐ రామకృష్ణ

ఇచ్చోడ: చేతి పంపును పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

బోథ్, ఏప్రిల్ 2 : వేసవి కాలం మొదలైనందున గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యకాధికారి కిరణ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో మహేందర్ రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్లు, మోటర్లకు అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరుశాతం పెంచేలా చూడాలని తెలిపారు. జాబ్ కార్డులు ఉన్నవారందరూ పనులకు వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. 33 నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో 33 గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించాలి

ఇచ్చోడ, ఏప్రిల్ 2 : వేసవి కాలంలో దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో లక్ష్మణ్ సూచించారు. మంగళవారం సల్యాద గ్రామపంచాయతీ పరిధిలోని జగ్నపూర్‌లో పర్యటించి మిషన్ భగీరథ ట్యాంకు, చేతి పంపులను పరిశీలించారు. గ్రామంలో ప్రతి రోజూ మిషన్ భగీరథ నీరు అందించాలని తెలిపారు. ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు.

ట్యాంకర్లతో నీటిని అందజేస్తాం

తాంసి, ఏప్రిల్ 2 : మిషన్ భగీరథ నీరందని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తామని మండల ప్రత్యేకాధికారి, సీపీవో వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డితో కలిసి అట్నంగూడ, లింగూడలో నీటి సమస్యను పరిశీలించి మాట్లాడారు. వారంలో రెండు రోజులే భగీరథ నీరు వస్తుందని స్థానికులు తెలుపడంతో నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రశాంత్, శేఖర్, ఎంపీవో స్వప్నశీల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

జైనథ్, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్‌తోపాటు మండలకేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌టీ టీం బృందం అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. రూ.50 వేలకుపైగా నగదును తీసుకువెళ్తే సరైన ఆధారాలు, రసీదు ఉండాలన్నారు. లేనిపక్షంలో నగదు సీజ్ చేసి ఆదాయ పన్నుల అధికారులకు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ నరేశ్, హోంగార్డ్ అనిల్, డ్రైవర్ జహీర్, ఎస్ ఎఫ్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులు తనిఖీ చేసిన డీఎస్పీ

భీంపూర్, ఏప్రిల్ 2: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కరంజి(టీ), తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టులను ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి సోమవారం అర్ధరాత్రి తనిఖీ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు గ్రామాలనుంచి రాకపోకలు సాగించే వాహనాలు, వ్యక్తులను నిశితంగా తనిఖీ చేయాలని సర్వేలైన్ టీం, సిబ్బందిని ఆదేశించారు. మహారాష్ట్ర నుంచి దేశీదారు, డబ్బు లాంటివి రాష్ట్రంలోకి రవాణా కాకుండా డేగకన్నుతో పరిశీలన చేయాలన్నారు. స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రజకు సూచించారు.

జైనథ్: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఎఫ్‌టీ టీం అధికారులు

తాటి ముంజలతో ఉపాధి

నార్నూర్ సంతలో బండిపై తాటిముంజలు అమ్ముతున్న వాపారి సత్య

నార్నూర్, ఏప్రిల్ 2: వేసవికాలంలో చల్లదనాన్ని ఇస్తున్న తాటి ముంజలు ఎందరికో ఉపాధిని కల్పిస్తున్నాయి. నార్నూర్, గాదిగూడ, ఉట్నూర్, ఇచ్చోడ, జైనూర్, కెరమెరి, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్ మండల కేంద్రాల్లోని సంతల్లో తాటి ముంజల వ్యాపారం జోరుగా సాగుతున్నది. కడెం, మెట్‌పల్లి, ఖానాపూర్ ప్రాంతాల నుంచి తాటిముంజలు తీసుకొచ్చి అమ్ముతున్నారు. వేసవికాలంలో తాటి ముంజల ద్వారా ఉపాధి పొందుతున్నామని ధర్మాజీపేట్‌కు చెందిన వ్యాపారి సత్య తెలిపారు.

తాటి ముంజల రేటు మిన్నంటాయి..

ఒకప్పుడు డజన్ ముంజలకు రూ.25నుంచి రూ.30 ఉండగా, ఇప్పుడు డజనుకు రూ.100 నుంచి 120 ధర పలుకుతుంది. చల్లదనం కోసం సేద ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. పిల్లలు,పెద్దలు సైతం తాటి ముంజలపై ఆసక్తి చూపుతున్నారు.

రోజుకు రూ.వెయ్యి ఆదాయం ..

తాటి ముంజల అమ్మితే రోజుకు రూ.వెయ్యి వరకు ఆదాయం వస్తున్నది. తాటి చెట్ల మీద నుంచి వీటి గెలల్ని నరికి ఆటోపై తీసుకొచ్చి అమ్ముతాం. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల సంతల్లో విక్రయిస్తాం. సంతకు వచ్చే ప్రజలు వేసవిలో దాహాన్ని తీర్చుకొనేందుకు ముంజలను కొంటున్నారు. ఆటో కిరాయి పోను గిట్టుబాటవుతోంది. ఈ సీజన్‌లో వ్యాపారం బాగానే ఉంది.

-సత్య వ్యాపారి(ధర్మాజీపేట్)

చెరువులో ఈదుతున్న చిన్నారులు

చెరువులో సేద దీరుతున్న బర్రెలు

నీటితొట్టెలో సేదదీరుతున్న శునకం

ఎండలో చల్ల చల్లగా..

నార్నూర్, ఏప్రిల్ 2: రోజురోజుకూ ఎండలు భగ్గుమంటున్నాయి. ఎండతీవ్రతను మనుషులతో పాటు మూగజీవాలు తట్టుకోలేపోతున్నాయి. మంగళవారం ఎండ వేడి మి నుంచి ఉపశమనం పొందేందుకు చెరువులో చిన్నారులు, తాగునీటి ట్యాంకు వద్ద బాలుడు, నీటి తొట్టెలో శునకం, చెరువులో బర్రెలు సేదతీరుతూ కనిపించాయి.

దాహార్తికి అల్లాడతున్న మూగజీవులు

మురికి గుంటలో నీళ్లు తాగుతున్న పశువులు

నార్నూర్,ఏప్రిల్ 2: ఓ వైపు వేసవి తాపం పెరుగుతోంది. మరో వైపు చెరువులు, నీటి కుంటలు ఎండిపోతున్నాయి. దీంతో గుక్కెడు నీళ్లు దొరక్క మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఎండ తీవ్రతకు ఎక్కడ నీళ్లు కనిపించినా పరుగులు పెట్టి దాహం తీర్చుకుంటున్నాయి. మంగళవారం ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో మేతకు వెళ్లిన పశువులు మురుగు కాలువల్లో దాహార్తి తీర్చుకున్నాయి.

నేడు సాయిలింగికి బోథ్ ఎమ్మెల్యే రాక

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 2 : తలమడుగు మండలం సాయిలింగిలో బుధవారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఉత్సవాల్లో పాల్గొంటారని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని జిల్లా నాయకుడు కేదారేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

ఆర్టీసీ సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : ఆర్టీసీలో పని చేసే డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కొప్పుల యోగేశ్వర్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో డిపో మేనేజర్ కల్పనతో కలిసి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మేకల పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : ఆదిలాబాద్ రూరల్ మండలం లోకారికి చెందిన రైతు సంతోషం శ్రీనివాస్ 6 నెలల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం బాధిత కుటుంబీకురాలు నవనీతకు రూ.22 వేల విలువైన మేకలను కిసాన్ బంధు రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ ప్రోద్బలంతో, దీప్తి మనోహర్ యాదవ్ ఆర్థిక సహాయంతో రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న పంపిణీ చేశారు. ఇక్కడ రాకేశ్, మహేందర్, రవీందర్, స్వామి ఉన్నారు.

రిమ్స్‌లో పండ్ల పంపిణీ

ఎదులాపురం, ఏప్రిల్ 2: సర్దార్ పాపన్నగౌడ్ 314 వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం సర్దార్ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో రిమ్స్ పిల్లల వార్డులో పండ్లు, జ్యూస్ పంపిణీ చేశారు. ఇక్కడ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆర్ఎంవో డాక్టర్ ఇద్రీస్ అక్బానీ, డాక్టర్ హేమలతా రెడ్డి, డాక్టర్ తిరుమల్‌రెడ్డి, గౌడ యువజన సంఘం అధ్యక్షుడు గజానన్‌గౌడ్, సభ్యులు అనిల్ భుజం , ఈశ్వర్‌గణేశ్, భూపతి ,చరణ్ గౌడ్, లక్ష్మీనారాయణ, సంతోష్‌గౌడ్, భూమాగౌడ్, దినేశ్ ఉన్నారు.

ఆశ కార్యకర్తలకు శిక్షణ

భీంపూర్, ఏప్రిల్2: ఆశ డే సందర్భంగా మంగళవారం భీంపూర్ పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బయోమెట్రిక్ ద్వారా కార్డులు రూపొందించడంపై పీహెచ్‌సీ డీఈవో విష్ణుకుమార్ శిక్షణ ఇచ్చారు. వేసవిలో జాగ్రత్తల గురించి వైద్యాధికారి నిఖిల్‌రాజ్ వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, సిబ్బంది సరస్వతి, సుజాత, లచ్చుబాయి, జానాబాయి, విజయలక్ష్మి, గోదావరి, భాగ్యవతి న్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 2: మండలంలోని ప్రతి కూలీకి ఉపాధిహామీ పనులు కల్పించాలని డీఆర్డీవో సాయన్న ఆదేశించారు. మంగళవారం ఇంద్రవెల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు తీవ్రంగా ముదిరిపోతున్నందున ఉదయాన్నే వచ్చి పనులు చేయాలన్నారు. ఇక్కడ ఈసీ జాదవ్ శ్రీనివాస్, టీఏ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ చేరుకున్న సైకిల్ యాత్ర

హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌కు చెందిన బుడ్డ అంకుల్ చార్ ధాం, జ్యోతిర్లింగాల దర్శనానికి 2023 మే